ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

గురువారం 17 ఏప్రిల్ 2025





మదనపల్లె రెవెన్యూ గ్రామంలోని 28 సెంట్ల బొంతలవారిసత్రం

వీరబల్లిలో చిరుతపులి సంచారం?

● భయాందోళనలో ప్రజలు

వీరబల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుగాలితాండా సమీపంలో వారం రోజుల నుంచి చిరుతపులి సంచరిస్తున్నట్లు ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. వారం రోజులుగా చిరుతపులి మేకలను వెంటాడి ఎత్తుకెళ్లిన ఘటనలు జరిగాయి. మంగళవారం అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే రైతు పొలం వద్దకు వెళుతుండగా చిరుతపులి కనిపించడంతో భయాందోళనకు గురై ఊరిలోకి పరుగులు తీశాడు. ఫారెస్టు అధికారులు, సిబ్బంది దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చిరుతపులి సంచారం విషయం గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. బుధవారం తమ సిబ్బంది ఆ గ్రామానికి వెళ్లి చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించారని, ఎండలు ఎక్కువ కావడంతో అడవిలో నుంచి చిరుతపులి గ్రామానికి సమీపంలోని కుంట దగ్గరికి వచ్చి ఉంటుందని తెలిపారు. గ్రామస్తులు ఎలాంటి భయాందోళనకు గురి కావద్దని తెలిపారు.

సోలార్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

● ఆర్డీవో శ్రీనివాసులు

గాలివీడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తూముకుంట సోలార్ నిర్వాసితులకు న్యాయం చేస్తామని ఆర్డీవో శ్రీనివాసులు హామీ ఇచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోలార్ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు సోలార్ పవర్‌ప్లాంట్ నిర్మాణం కోసం 141 ఎకరాల భూసేకరణలో భాగంగా రైతులతో మాట్లాడారు. గతంలో ఏ విధంగా అయితే హంద్రీ-నీవా కాలువ కోసం ఎకరాకు రూ.6 లక్షలు పరిహారం చెల్లించారో అదే విధంగా ఇప్పుడు కూడా అదే మొత్తాన్ని చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. అయితే నష్టపరిహారం ఖరారు చేసే అధికారం కలెక్టర్ పరిధిలో ఉన్నందున మీ వినతులను వారి దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఆర్డీవో రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలత, ఆర్ఐ బాలాజీ, మండల సర్వేయర్ మురళి, రైతులు పాల్గొన్నారు.



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కందుకూరి విశిష్ట పురస్కారాన్ని మంత్రి దుర్గేశ్ చేతుల మీదుగా అందుకుంటున్న పీలేరుకు చెందిన షేక్ ఖాదర్‌బాషా

దేవుడా..కరుణించవయ్యా..!

● ప్రైవేటు స్థలాలు..దేవుడి ఖాతాలో..

● స్థలాలు, నివాసాల రిజిస్ట్రేషన్లు బంద్

● పదేళ్లుగా పోరాటం..ఫలితం శూన్యం..



దేవుడిమాన్యంలో చేర్చిన పెంచుపాడు రోడ్డులోని స్టోరు వీధి



రిజిస్ట్రేషన్లు ఆగిపోయిన కమ్మపల్లె సర్వేనెంబర్-296లోని మోతీనగర్

మదనపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, డీకేటీ భూములు మినహా ప్రైవేటు ఆస్తులు ఏవీ కూడా ఎక్కడా నిషేధిత జాబితా (22ఏ)లో లేకుండా చేస్తాం.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.. అంటూ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇటీవల చేసిన ప్రకటన ఇది. అయితే మదనపల్లె పట్టణంలోని ప్రధాన ఏరియాలో విలువైన భూములు, స్థలాలు, నివాసాలు చాలా వరకూ నిషేధిత జాబితాలో ఉన్నాయి. కారణం ప్రభుత్వ, దేవదాయ శాఖ భూములు కూడా అదే సర్వే నెంబర్లలో ఉండటమే. అలాగే స్థానికంగా ఉన్న కొందరు భూస్వాములు, దాతలు తమ జ్ఞాపకార్థం సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా గుడి, బడి, ఆసుపత్రులకు కూడా కొంత స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఇవి కూడా అదే సర్వే నెంబర్లలో ఉండటంతో దాతలకే కాదు.. అందులో స్థలాలు కొనుగోలు చేసి నివాసం ఉన్న వారికీ శాపంగా మారింది. అలాంటి వాటిని పేరన్ సర్వే నెంబర్ నుంచి సబ్ డివిజన్ చేసి రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలి. కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు రెవెన్యూశాఖ క్షేత్రస్థాయిలో ఆ పని చేయలేదు. పైసలొచ్చే పనైతే ఆగమేఘాల మీద చేసే సర్వే శాఖ, రెవెన్యూ అధికారులు సామూహిక పనులకు దూరంగా ఉంటున్నారు.

దేవదాయశాఖ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆలయ భూములను రెవెన్యూ గ్రామం, సర్వే నెంబర్ల ఆధారంగా గుర్తించి తమకు నివేదించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో భూముల గుర్తింపు జాబితాలో భారీగా తప్పులు చోటుచేసుకున్నాయి. రెవెన్యూ అధికారులు తయారు చేసిన తప్పుల తడక జాబితాను దేవదాయ శాఖ ఆయా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపింది. ఈ జాబితాలోని సర్వే నెంబర్లలోని భూములు దేవుడి మాన్యాలని, వీటి రిజిస్ట్రేషన్లు నిలిపేయాలని ఆదేశించడంతో నిషేధిత జాబితా (22ఏ)లో పెట్టేశారు. ఇలా మదనపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్-227, కమ్మపల్లె రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్-296 బ్లాక్ చేశారు.

ఒక ప్రధాన సర్వే నెంబర్‌లో ఎక్కడో ఒక చోట దేవదాయశాఖ భూమి సెంట్ల విస్తీర్ణంలో ఉంటే మొత్తం సర్వే నెంబర్‌లోని ఎకరాల భూమినే బ్లాక్ చేశారు. దీంతో ఆ సర్వే నెంబర్‌లోని భూములన్నీ రిజిస్ట్రేషన్ల నిషేధిత జాబితాలో చేరిపోయాయి.

అలాగే ఒక రెవెన్యూ గ్రామంలో దేవదాయశాఖ భూములు ఉంటే అదే సర్వేనెంబర్, విస్తీర్ణాన్ని మరో రెవెన్యూ గ్రామంలోకి చేర్చారు. దీంతో రెండు చోట్లా రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. ఫలితంగా వందల నివాసాలు, స్థలాల రిజిస్ట్రేషన్లు ఆగిపోగా, బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2016 నుంచి ఇప్పటి వరకు బాధితులు అటు రాజకీయ నాయకులు, ఇటు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదు. చివరకు కొందరు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు.

మదనపల్లె మున్సిపాలిటీలో మదనపల్లె రెవెన్యూ గ్రామం, కమ్మపల్లె రెవెన్యూ గ్రామం, బండమీద కమ్మపల్లె రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటితో పాటు మదనపల్లె మండలం పొన్నేటిపాళెం రెవెన్యూ గ్రామంలోని కొంతభాగం కలిపి మున్సిపాలిటీ ఆవిర్భవించింది. ఈ మూడు రెవెన్యూ గ్రామాల్లో సుమారు 500 సర్వేనెంబర్లలో వేల ఎకరాలు, రూ.కోట్ల విలువచేసే భూములు ఉన్నాయి. అయితే ప్రస్తుతం అవి కొరకరాని కొయ్యగా మారాయి.

● మదనపల్లె రెవెన్యూ గ్రామానికి చెందిన సర్వే నెంబర్-227లో 5.20 ఎకరాల భూమి ఉంది. ఇదే సర్వే నెంబర్‌లో దేవదాయ శాఖ పరిధిలోని బొంతలవారి సత్రానికి కేవలం 28 సెంట్లు మాత్రమే ఉన్నా మొత్తం సర్వే నెంబర్‌నే బ్లాక్ చేశారు. ఇందులో 50 ఏళ్లగా పైగా నివాసాలు, స్థలాలు, ప్లాట్లు ఉన్నాయి. అలాగే బొంతలవారిపల్లె సత్రం భూమిని కమ్మపల్లె రెవెన్యూ గ్రామంలోకి చేర్చడంతో అక్కడా రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి.

● మదనపల్లె పట్టణం పెంచుపాడు రోడ్డులోని మదనపల్లె రెవెన్యూ గ్రామానికి చెందిన సర్వే నెంబర్-227ను కమ్మపల్లె గ్రామంలోకి చేర్చారు. ఈ సర్వేనెంబర్-227లో ఇదివరకే 227-1, 2, 3 సబ్ డివిజన్లు అయ్యాయి. ఇందులోని సర్వే నెంబర్-227-3లో 1.54 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో సగానికిపైగా ఇప్పటికే 50 ఏళ్లకుపైగా ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉన్నా..దేవుడి ఖాతాలో చేర్చేశారు. దీనిని పక్కన పెట్టి పేరన్ సర్వే నెంబర్‌ను ప్రామాణికంగా తీసుకోవడంతో అసలు సమస్య మొదలైంది. ఇదే సర్వే నెంబర్‌లో ఉన్న బొంతలవారి పల్లెసత్రం విస్తీర్ణం 28 సెంట్లను సబ్ డివిజన్ చేసి, దేవుడి మాన్యంగా కేటాయిస్తే సరిపోతుంది. ఇదే తప్పు అనుకుంటే, ఇదే విస్తీర్ణాన్ని మరో గ్రామం రెవెన్యూ గ్రామం కమ్మపల్లెలోనూ చూపుతూ అక్కడా మరో తప్పు చేశారు. ఇక్కడ సమస్య ఉందని అధికారులకు తెలిసినా..మనకెందుకులే అని చూసీచూడనట్లు పోతున్నారు.

● మదనపల్లె మండలం పొన్నేటిపాళెం రెవెన్యూ గ్రామంలోని ఓ సర్వే నెంబర్‌లో 38 సెంట్లు..స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూమి ఉండగా, దానిని మదనపల్లె రెవెన్యూ గ్రామంలోనూ ఉన్నట్లు చూపించారు. దీంతో రెండు చోట్లా రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. కేవలం 38 సెంట్ల భూమికి గాను వంద మందికి చెందిన వందల ఎకరాల భూమి క్రయ, విక్రయాలు ఆగిపోయాయి. ఇదే కాదు..పట్టణం నడిబొడ్డున ఉన్న జిల్లా ప్రభుత్వాసుపత్రి, ఆర్టీసీ బస్టాండుల నిర్మాణానికి ఇచ్చిన స్థలాలు, రెవెన్యూ గ్రామాల సర్వే నెంబర్ల పరిస్థితీ ఇలాగే ఉంది.

7

రక్తమోడిన రహదారులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పగడాల వరలక్ష్మి



పగడాల వరలక్ష్మి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నాయకురాలు పగడాల వరలక్ష్మిని రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బుధవారం ప్రభుత్వం ప్రకటించింది. చాలా రోజులుగా ఈ నామినేటెడ్ పదవి పెండింగ్‌లో ఉంది. ఇటీవల నామినేటెడ్ పదవుల నియామకాలు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. రిజర్వేషన్ పరంగా రైల్వేకోడూరుకు కొంతకాలం పెండింగ్ పడింది. మొదట పురుషులకు కేటాయించగా చివరకు మహిళకు కేటాయించారు. ఇటీవల జనసేన పార్టీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై సమావేశం ఏర్పాటు చేసి తర్జనభర్జన పడ్డారు. చివరకు జనసేన పార్టీ కార్యకర్త మైసూరివారిపల్లెకు చెందిన పగడాల చంద్రశేఖర్ భార్య పగడాల వరలక్ష్మికి ఖరారు చేశారు.

అకాల వర్షంతో రైతన్న కుదేలు



ఓబులవారిపల్లె మండలంలో గాలి వానకు నేలవాలిన అరటి చెట్లు

● వందలాది ఎకరాల్లో నేలకూలిన అరటి తోటలు

● తోటలను పరిశీలించిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్



అరటి తోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, అధికారులు



ఉప్పరపల్లెలో గాలులకు పడిపోయిన అరటి తోటలను పరిశీలిస్తున్న అధికారులు

ఓబులవారిపల్లె/రైల్వేకోడూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల్లో మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులు, వర్షం రైతులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. గాలులు, వర్షానికి గాదెల, బాలిరెడ్డిపల్లె, వై.కోట గ్రామ పంచాయతీల్లో అరటి పంటకు తీవ్ర నష్టం కలిగింది. అదేవిధంగా మామిడి రైతులకు కాపులో ఉన్న పంట నేలకూలడంతో పాటు కొన్ని సంవత్సరాలుగా సాగులో ఉన్న మామిడి చెట్లు వేర్లతో పాటు నేలకూలడంతో ఉదయం పొలాల వద్దకు వెళ్లి చూసిన రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డిలు హార్టికల్చర్ అధికారులతో కలిసి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గాదెల గ్రామ పంచాయతీలో 20 మంది రైతులకు చెందిన 35 ఎకరాలు, బాలిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో ఆరుగురు రైతులకు సంబంధించి 11 ఎకరాలు, వై.కోట గ్రామ పంచాయతీలో 35 మంది రైతులకు సంబంధించి 70 ఎకరాలు, మామిడి, అరటి పంటలకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేసినట్లు హార్టికల్చర్ అధికారి భాస్కర్ వివరించారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు సుమారు 3 లక్షల రూపాయలు నష్టపరిహారం ప్రభుత్వం ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా సోమవారం నాడు ఇదే విధంగా వీచిన గాలివానలకు రాళ్లచెరువుపల్లె, పెద్దఓరంపాడు, బొమ్మవరం, బి.కమ్మపల్లె వంటి గ్రామ పంచాయతీల్లో అరటి, బొప్పాయిపంటలకు ఇబ్బంది జరిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి రాకుండానే నేలకూలి నష్టాలపాలైన రైతులను ఆదుకోవాలని రైతు, కార్మిక సంఘాల నాయకులతో పాటు పలువురు గ్రామస్థులు సైతం కోరుతున్నారు.

ఆరు ఎకరాల అరటి తోట ధ్వంసం

మంగళవారం రాత్రి రైల్వేకోడూరులో వీచిన పెనుగాలులకు ఎస్.ఉప్పరపల్లె గ్రామానికి చెందిన ముగ్గురు రైతుల అరటి తోట 6 ఎకరాలు ధ్వంసం అయింది. దీంతో సుమారు రూ.20 లక్షలు నష్టం వాటిల్లింది. పంట చేతికి అందే సమయంలో రైతులకు గాలులు నష్టపరిచాయి. మామిడి పంట అసలే అతి తక్కువగా దిగుబడులు వచ్చాయి. దీనికి తోడు పెనుగాలులు శాపంగా మారాయి. మండలంలోని ఉప్పరపల్లె లో పడిపోయిన అరటి తోటలను ఉద్యానశాఖ అధికారి భాస్కర్, ఉద్యాన అసిస్టెంట్ ఉమామహేశ్వరి, వీఆర్‌వో తదితరులు బుధవారం పంటలను పరిశీలించి ప్రాథమిక అంచనాలు వేశారు. తుది నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని వారు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని అరటి, మామిడి రైతులు వేడుకుంటున్నారు.


సన్నగిల్లుతున్న ఆశలు!

● నామినేటెడ్ పోస్టులపై ఆశావహుల్లో నిరాశ

● 10 మార్కెట్ కమిటీల్లో నాలుగింటికే చైర్మన్ల ప్రకటన

● ఊసే లేని సింగిల్ విండోల కమిటీలు

● ఆలయ కమిటీలకు కలగని మోక్షం



కలికిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధికారంలోకి రాగానే ఇక తమకు పదవులు ఖాయమనే ఆనందంతో నాయకులు, కార్యకర్తలు ధీమా ప్రదర్శించారు. తమకు ఫలానా పోస్టు ఖరారైందని, తమ పేరు పరిశీలనలో ఉందని ఆశపడ్డ వారికి నిరాశే ఎదురవుతోంది. నామినేటెడ్ పోస్టులపై పెట్టుకున్న ఆశలు సన్నగిల్లుతున్నాయని పలువురు వాపోతున్నారు. జిల్లాలో 10 వ్యవసాయ మార్కెట్ కమిటీలున్నాయి. ఒక్కో కమిటీలో అధ్యక్షుడు సహా మొత్తం 15 మందితో కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంది. అంటే జిల్లా మొత్తం మీద 150 మందికి అవకాశం దక్కుతుంది. పదవుల రీత్యా మరో 10 సర్పంచులకూ స్థానం లభిస్తుంది. జిల్లాలో 160 మందిని నియమించే వెసులుబాటు ఉంది. అయితే గత నెల 28న మొదటి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా 47 మంది అధ్యక్షుల పేర్లను ప్రకటించారు. ఇందులో జిల్లాలోని 10 కమిటీలకు గానూ పీలేరు నియోజకవర్గంలోని మూడు కమిటీల అధ్యక్షుల పేర్లను మాత్రమే ఖరారు చేశారు. తాజాగా ఈనెల 4న మరో 38 కమిటీలకు చైర్మన్లను ప్రకటించినా అందులో జిల్లాకు స్థానం దక్కలేదు. పీలేరు నియోజకవర్గానికి సంబంధించిన కలికిరి, పీలేరు, వాల్మీకిపురం కమిటీలకు కూడా రెండు వారాలు గడుస్తున్నా డైరెక్టర్‌లతో కూడిన పూర్తి స్థాయిలో ఇప్పటికీ ఉత్తర్వులు రాలేదు. పీలేరు, మదనపల్లె, రాయచోటి, కోడూరు నియోజకవర్గాల్లో అధికార కూటమికి చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. రాజంపేట, తంబళ్లపల్లెలో వైసీపీ ఎమ్మెల్యేలున్నారు. ఇక్కడ ఇన్‌చార్జీల మధ్య నెలకొన్న గ్రూపు తగాదాలు పతాకస్థాయిలో ఉన్నాయి. మదనపల్లె, కోడూరులో కూడా అధికార కూటమి ఎమ్మెల్యేలు అసమ్మతి సెగను ఎదుర్కోవడంతో నామినేటెడ్ పోస్టుల వ్యవహారం ఒక కొలిక్కి రాలేదు. తాజాగా బుధవారం రైల్వేకోడూరు మార్కెట్ కమిటీకి జనసేనకు చెందిన పగడాల వరలక్ష్మికి ప్రకటించారు.

సింగిల్ విండోలదీ అదే తీరు

జిల్లాలోని 40 ప్రాథమిక వ్యవసాయ సంఘాలు (పీఏసీఎస్)కు ఒక చైర్మన్, ఇద్దరు సభ్యులతో కూడిన నామినేటెడ్ కమిటీలను నియమించాల్సి ఉంది. దీంతో జిల్లాలో మరో 120 మందికి అవకాశం దక్కుతుంది. ఈ నియామకాలకు సంబంధించిన కసరత్తు నియోజకవర్గ స్థాయికే పరిమితమై ఉందని అంటున్నారు. జిల్లాలో ఇవి కూడా ఒకటి రెండు నియోజకవర్గాలకు సంబంధించిన జాబితాలు మాత్రమే పార్టీ అధిష్టానానికి చేరాయని, మిగిలినవన్నీ అసంపూర్తిగానే ఉన్నాయంటున్నారు.

దేవాలయ కమిటీలకు కలగని మోక్షం

జిల్లాలోని దేవాలయాలకు కూడా కమిటీలను నియమించనున్నట్లు పార్టీ పెద్దలు పదే పదే చెబుతున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల మేరకు అయితే జిల్లాలో కేవలం 14 ఆలయాలకు మాత్రమే కమిటీలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కేవలం రూ.5 లక్షల పైబడి ఆదాయం ఉన్న ఆలయాలకు మాత్రమే ప్రస్తుతం నామినేటెడ్ పోస్టుల్లో నియమించే ప్రయత్నాల్లో ఉన్నారు. అలా కాకుండా గతంలో లాగే ప్రాచుర్యం ఉన్న ఆలయాలన్నింటికీ ట్రస్ట్ బోర్డులు నియమించాలని కోరుతున్నారు.

లైబ్రరీల్లోనూ అవకాశం ఇవ్వాలి

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మాత్రమే గ్రంథాలయ సంస్థ అధ్యక్ష పదవి ఉంది. కొత్త జిల్లాల్లో గ్రంథాలయ సంస్థలు ఏర్పాటు చేయలేదు. జిల్లాల్లో అన్ని మండల కేంద్రాల్లో స్థానిక గ్రంథాలయాలున్నాయి. స్థానిక సంస్థలు గ్రంథాలయాల పేరుతో ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్నా వాటిని గ్రంథాలయ సంస్థకు జమ చేయడం లేదు.

ఆ మేరకు రూ.కోట్లలో నిధులు రావలసి ఉంది. నిధుల కొరతతో కొత్త కొత్త పుస్తకాల సంగతి ఎలా ఉన్నా కనీసం గ్రంథాలయాల సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేకపోతున్నారు. ఈ సమస్య తీరాలంటే స్థానిక గ్రంథాలయాలకు స్థానికులతో కమిటీలను నియమిస్తే నిధులను రాబట్టుకోవడానికి, గ్రంథాలయాల అభివృద్ధికి అవకాశముంటుంది. ఈ పేరుతో జిల్లాలో మరో 90 మందికి కూడా నామినేటెడ్ పోస్టులు దక్కే అవకాశం కూడా ఉంటుందని చెబుతున్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో కేసుల దర్యాప్తు: ఎస్పీ



నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కేసుల దర్యాప్తులో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని దర్యాప్తు చేపట్టాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. బుధవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని రాయచోటి అర్బన్, రాయచోటి రూరల్ పోలీస్‌స్టేషన్‌ల అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల సబ్ డివిజన్ పరిధిలో చోటు చేసుకున్న ముఖ్య నేర సంఘటనలు, వాటిపై చేపట్టిన విచారణలు, పరిష్కారాల పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. మహిళల భద్రత, మైనర్‌లపై జరుగుతున్న అకృత్యాల నిరోధం, డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వ్యాప్తిని అడ్డుకోవడం, మైనర్లు వాహనాలు నడపకుండా కఠిన చర్యలు, రౌడీషీటర్లపై నిఘా, వారి కార్యకలాపాలను అణచివేయడం, ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసి వాటి పనితీరును సమీక్షించడం, కేసుల దర్యాప్తుల్లో ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కేసులను దర్యాప్తు చేయాలని, కమ్యూనిటీ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించడం, సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ద్వారా తప్పుడు ప్రచారాలు చేసి వారిని అరికట్టడం, సైబర్ క్రైమ్ నేరాలు తగ్గించడం వంటి పలు అంశాలపై పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు సంబంధిత పోలీసుస్టేషన్ల పరిధిలో నేరాల స్థితిగతులు, పట్టుబడిన నిందితుల వివరాలు, విచారణ పురోగతి, నేర నివారణకు చేపట్టిన చర్యలపై ఎస్పీకి వివరించారు. సమిష్టి కృషి సమన్వయంతో పనిచేసి సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, మదనపల్లి డీఎస్పీ ఎస్.మహేంద్ర, రాయచోటి అర్బన్ ఇన్‌స్పెక్టర్ బీవీ చలపతి, రాయచోటి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వరప్రసాద్ డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ మర్రి తులసీరాం, సుండుపల్లె, సంబేపల్లె, చిన్నమండెం, వీరబల్లి మండలాల ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి... భవితకు వారధి

● మహిళల ఆర్థిక భరోసాకు ప్రభుత్వం చేయూత
● జీవనోపాధుల రుణ ప్రణాళిక అమలుకు సర్వే ముమ్మరం


మైలవరంలో శిక్షణ పొందుతున్న ఎన్యుమరేటర్లు

మైలవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. సంఘాల్లోని మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు అందించి వారి ఆర్థిక స్వావలంభన సాధించేందుకు వార్షిక రుణ జీవనోపాధుల ప్రణాళిక అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం సంఘాల సభ్యుల్లోనే యానిమేటర్లను ఎన్నుకుని వారితో జీవనోపాధుల రుణ ప్రణాళికను చేపట్టారు. ఈనెల మొదటి వారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న 35 మండలాల్లో ప్రారంభమైన సర్వే మరో నాలుగు రోజుల లోపు పూర్తి చేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

రుణాలు ఇలా...

స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు ఇప్పటి వరకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి వంటి పథకాల కింద బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. వీటితో పాటు పొదుపును కూడా రుణంగా వినియోగించుకోవాలని సూచిస్తున్నాయి. ప్రస్తుతం రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు సంఘాల సీనియార్టీ ప్రకారం బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి.

180 రకాల వ్యాపారాలకు అవకాశం...

ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రుణ జీవనోపాధుల అమలుకు సర్వే చేపట్టింది. మొత్తం 20 రంగాల్లో దాదాపు 180 రకాల వ్యాపారాలకు ప్రస్తుతం అవకాశం కల్పిస్తోంది. ముఖ్యంగా వ్యవసాయం, పట్టుపరిశ్రమ, చేపల పెంపకం, ఉద్యానం, లైవ్‌స్టాక్, తయారీ రంగం, సేవల రంగాల్లో హస్తకళలు, చేతివృత్తులు తదితర వ్యాపారాలు చేసుకునేందుకు ఈ సర్వే ద్వారా అవకాశం ఏర్పడుతుంది. సంఘంలోని మహిళల్లో పది, ఇంటర్ వరకు చదువుకున్న వారిని ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా సర్వే చేస్తున్నారు.

జిల్లాలో సర్వే వివరాలు ఇలా..

మండలాలు	- 35
గ్రామ సమాఖ్యలు	- 1105
సంఘాలు	- 27,582
సభ్యులు	- 2,73,200 మంది
సర్వేచేస్తున్న ఎన్యుమరేటర్లు	- 4,725
సర్వే పూర్తయిన సభ్యులు	- 2,61,774 మంది
సర్వే శాతం	- 75.85 శాతం

(సోమవారం 5 గంటల వరకు)

ప్రభుత్వానికి నివేదిస్తాం..

వార్షిక జీవనోపాధుల సర్వే పూర్తయితే ఒక నిర్దేశిత ప్రణాళిక తయారు చేస్తాం. దాని ప్రకారం సంఘాల్లోని సభ్యులకు జీవనోపాధుల కోసం రుణాలు అందించి.. మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తాం. త్వరగా సర్వే పూర్తి చేసి నివేదికలు ప్రభుత్వానికి పంపుతాం.

- ఆనందనాయక్, డీఆర్‌డీఏ పీడీ, కడప

ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం


మాట్లాడుతున్న స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ సురేష్‌బాబు

సిద్దవటం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ సురేష్‌బాబు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై మహిళా సమాఖ్యలతో భాగ స్వామ్యం ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. రైతుసాధికార సంస్థ స్వయం సహాయక సంఘాలు, గ్రామ సమాఖ్య సంఘాలతో సంప్రదించి ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేస్తుందన్నారు. రైతు సాధికార సంస్థ గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసే రైతులను కమ్యూనిటీ రీసోర్స్‌పర్సన్(సీఆర్‌పీ)లుగా తీసుకుని వారి ద్వారా అమలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్, అదనపు ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి, బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు, మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, ఏపీఎం సుజాత, మండల సమైఖ్య అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

విద్యార్థులు గొప్పవారి చరిత్రను చదవాలి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో గొప్పవారి చరిత్రలు చదివి వారి ఆదర్శనీయమైన ఆలోచనలను జీవితానికి అన్వయించుకొని అనుసరించాలని వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ అన్నారు. బుధవారం వైవీయూ లలిత కళల శాఖలో కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా నాటక రంగ దినోత్సవం నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి రిజిస్ట్రార్ పద్మ, డీన్ గంగయ్య, శాఖ హెడ్ మృత్యుంజయరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం బాల్య వివాహాలను నిషేధించడం, వితంతు వివాహాలను ప్రోత్సహించడంతో పాటు బాలికల విద్య కోసం కృషి చేసిన మహానుభావుడన్నారు. కార్యక్రమంలో లలిత కళల శాఖ అధ్యాపకులు సీహెచ్ వెంకటేష్, చినరాయుడు, ఈరప్ప, వాసవి, చంటి సూరి, సిద్దిరాజ్ టెక్నికల్ అసిస్టెంట్ సుధాకర్,ఆఫీస్ సిబ్బంది లక్ష్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలి


స్కూల్ ఎడ్యుకేషన్ జేడీ సర్వీసెస్ పార్వతికి వినతి పత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ కేడర్‌లో జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని నోబుల్ టీచర్స్ అసోషియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావులు స్కూల్ ఎడ్యుకేషన్ జేడీ సర్వీసెస్ పయ్యావుల పార్వతికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులు, వారి కుటుంబాలకు దూరంగా ఉన్నారని, భార్య, భర్తలు కొన్ని సంవత్సరాలుగా వారి పిల్లలకు దూరంగా ఉండటం దృష్ట్యా వెంటనే ఈ వేసవి సెలవుల్లో అంతర్ జిల్లల బదిలీలు చేపట్టాలని కోరారు. అలాగే మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యా యులకు ఈ వేసవి సెలవుల్లో బదిలీలు చేపట్టాలని కోరారు. ఎన్‌టీఏ నేతల వినతికి స్కూల్ ఎడ్యుకేషన్ జేడీ సర్వీసెస్ పార్వతి సానుకూలంగా స్పందించారని వారు తెలియజేశారు.


మూలవంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జగదీష్, మౌలాలిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

రక్తమోడిన రహదారులు

● వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి ● పలువురికి తీవ్ర గాయాలు


మౌలాలి, జగదీష్ (ఫైల్ ఫొటోలు)

సీకేదిన్నె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. కడప- రాయచోటి జాతీయ రహదారిలోని బుగ్గలేటి పల్లె వద్ద స్కూటర్‌ను బొలెరో వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. సీకేదిన్నె సీఐ శివశంకర్ నాయక్ వివరాల మేరకు... మూలవంక గ్రామానికి చెందిన వేంపల్లె మౌలాలి (19), వెంకట జగదీష్ (20) మంగళవారం అర్ధరాత్రి బుగ్గలేటి సమీపంలోని డాబాకు వెళ్లి భోజనం చేసి తిరిగి కడప వైపు వస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బొలెరో వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ఇరువురికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీకేదిన్నె పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో చికిత్స నిమిత్తం తరలించారు. జగదీష్ ఆస్పత్రికి చేరుకునేలోపే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మౌలాలి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబీకులకు అప్పగించారు. ఇద్దరిది ఒకే ఊరు కావడంతో మూలవంక గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. వెంకట జగదీష్ బెంగుళూరులో బీబీఏ చదువుతున్నాడు. ఇతని తండ్రి శ్రీరాములు కరోనాలో మృతి చెందగా.. తల్లి కష్టపడి జగదీష్‌ను చదివిస్తోంది. మౌలాలి ఇంటర్ వరకు చదువుకుని సీసీ కెమెరాల కంపెనీలో పనిచేస్తూ చదువుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. ఇరువురు స్నేహితుల మరణం కుటుంబీకులను, గ్రామస్తులను ఎంతగానో కలచివేసింది.

అవయవ దానం: రోడ్డు ప్రమాదంలో మరణించిన మౌలాలి కళ్లను వారికుటుంబ సభ్యులు దానం చేశారు. పలువురికి జీవితాన్ని ఇవ్వాలనే మౌలాలి చివరి కోరిక మేరకు వారి కుటుంబ సభ్యులు కళ్లను దానం చేశారు. ఇంతటి బాధతలో కూడా కుటుంబ సభ్యులు అవయవ దానం చేయడం పట్ల గ్రామస్థులు అభినందించారు.

ఆటోను ఢీకొన్న మినీ లారీ.. మహిళ మృతి



చెన్నూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు అరుంధతీనగర్‌కు చెందిన లక్ష్మి గాండ్ల బాలమ్మ (45) అనే మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కడప నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో కూలీగా పనిచేస్తున్న ఈమె రోజూ ఉదయమే 5గంటల్లోపే హోటల్‌కు పనిచేసేందుకు వెళుతుండేది. ప్రతి రోజు లాగే బుధవారం ఉదయం స్థానిక కొత్తరోడ్డులో ఆటో ఎక్కింది. ఆమెతో పాటు చెన్నూరు కొత్తగాంధీనగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు అదే ఆటోలో వివిధ రకాల పనుల కోసం ఆటో ఎక్కారు. అదే సమయంలో మైదుకూరు వైపు నుంచి కడపకు వెళుతున్న మినీ లారీ వేగంగా వచ్చి ఆటో వెనుక వైపు ఢీకొంది. ఈ సంఘటనలో బాలమ్మ సంఘటనాస్థలంలో మృతి చెందగా.. డ్రైవరు పాలం రాజు, ఎద్దుల వెంకటేశ్‌తో పాటు తుమ్మలూరు సుబ్బమ్మ, వెంకటసుబ్బమ్మలు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కడపకు తీసుకెళ్లారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

ట్రాక్టరు ఢీకొనడంతో మహిళ...


సరోజమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తె

కమలాపురం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): నగర పంచాయతీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సరోజమ్మ (48) అనే మహిళ మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని రామ్‌నగర్ కాలనీకి చెందిన సరోజమ్మ బుధవారం తన కుమార్తెతో స్కూటీపై వెళుతుండగా రైల్వేగేటు సమీపాన ట్రాక్టరు ఢీకొంది. దీంతో ఆమె ట్రాక్టరు కింద పడి అక్క డికక్కడే మృతి చెందింది. కమలాపురం ఎస్ఐ విద్యాసాగర్ సంఘటనాస్థలానికి చేరు కుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. కాగా, మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ...తల్లీ కొడుకుకు తీవ్ర గాయాలు

చెన్నూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషయ్యగారిపల్లె వద్ద జాతీయ రహదారిపై బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో తల్లీ కొడుకుకు తీవ్ర గాయాలయ్యాయి. అలంఖాన్‌పల్లెకు చెందిన చాగలమర్రి పెద్దవీరయ్య (26) తన పెళ్లి శుభలేఖలు ఇచ్చేందుకు తల్లి ఫక్కీరమ్మ (45)తో కలసి ద్విచక్ర వాహనంలో మైదుకూరు బయలుదేరాడు. శేషయ్యగారిపల్లె వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ సంఘటనలో పెద్దవీరయ్య, ఫక్కీరమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమత్తం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హౌసింగ్ పనులు వేగవంతం చేయాలి

చిట్వేలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ వి.సాంబశివయ్య అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీలకు ప్రస్తుతం ఇస్తున్న 1.80 లక్షలతో పాటు అదనంగా 50 వేల రూపాయలు, అలాగే ఎస్టీలకు 70 వేల రూపాయలు అదనంగా ప్రభుత్వం అమలు పరుస్తుందన్నారు. గ్రామాల్లో లేనివారికి అవగాహన కల్పించి నూతనంగా పొజిషన్ పెంచేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పనులు వేగవంతం చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట డివిజన్ ఈఈ మురళీకృష్ణ, చిట్వేలి హౌసింగ్ ఏఈ సుధాకర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

మేడా రామలక్షుమ్మ నేత్రదానం


మృతురాలి నుంచి కార్నియాలను సేకరిస్తున్న దృశ్యం

పులివెందుల టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలోని అంకాలమ్మపేటకు చెందిన మేడా రామలక్షుమ్మ (86) మరణించడంతో ఆమె కుటుంబీకులు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృతహస్తం సేవా సమితి వారికి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు మృతురాలి పార్థీవ దేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలు దానం చేసేందుకు ప్రతి కుటుంబం ముందుకు రావాలన్నారు. నేత్రదానం చేయదలుచుకున్న వారు 7093204537 లేదా 9966500364లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ బుసిరెడ్డికి అరుదైన గౌరవం


ప్రిన్సిపాల్ నుంచి రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలో సర్టిఫికేట్ అందుకుంటున్న సుధాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాల భౌతికశాస్త్ర ప్రొఫెసర్ శాస్త్రవేత్త బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డికి మరోసారి అరుదైన గౌరవం లభించింది. ప్రపంచవ్యాప్తంగా 50వేల మంది సభ్యు లుగా ఉండే రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో ఫెలోగా అవకాశం దక్కిం చుకున్న ఈయన తాజాగా సొసైటీ వారు మెటీరియల్ కెమిస్ట్రీ, ఫిజిక్స్ విభాగాల్లో చేసిన ప్రతిభను గుర్తించి ఎఫ్‌ఆర్‌ఎస్సీ (ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ) అందించారు. దీనికి సంబంధించిన సర్టిఫికేట్‌ను అదేవిధంగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే రాయల్ సొసైటీ బ్యాడ్జిను డాక్టర్ బుసిరెడ్డికి పంపారు. బుధవారం కడపనగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ బ్యాడ్జిని డాక్టర్ బుసి రెడ్డికి తగిలించడంతో పాటు సర్టిఫికేట్‌ను అందించి అభినందించారు. ఈ సందర్భంగాపలువురు అధ్యాపకులు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేష్


సురేష్‌ను అభినందిస్తున్న కోనూరు సతీష్‌శర్మ

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కడప నగరానికి చెందిన ఎంఎల్ఎన్ సురేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడుపర్యాయాలు యువజన విభాగ అధ్యక్షుడిగా సురేష్‌బాబు పనిచేశారు. మంగళవారం ఏలూరులో రాష్ట్రస్థాయి సేవా సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సురేష్ బాబుకు రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ నియామక ఉత్తర్వులు అందేశారు. 2025, 2026 రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో సాగుతారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి పాటు పడతానని తెలిపారు.

అంతర్ జిల్లాల బైకు దొంగల అరెస్టు

● 27 ద్విచక్రవాహనాలు స్వాధీనం ● మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ వెల్లడి



మాట్లాడుతున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్, స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

చాపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అనంతపురం, సత్యసాయి, కడప జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం వారు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చాపాడు మండలంలోని అల్లాడుపల్లె దేవాలయం క్రాస్‌రోడ్డు వద్ద ప్రొద్దుటూరు, మైదుకూరు జాతీయ రహదారిపై ట్రైనింగ్ డీఎస్పీ భవానీ వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గు రు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి అరెస్టు చేసి విచారించగా.. ద్విచక్రవాహనాల చోరీ విషయం బయటపడినట్లు తెలిపారు. లింగాల మండలం వెలిదండ్ల గ్రామానికి చెందిన కర్ణ పవన్‌కుమార్‌రెడ్డి, కర్ణ లోక్‌నాథ్‌రెడ్డి, పులివెందుల పట్టణం రాజారెడ్డి కాలనీకి చెందిన గంగిరెడ్డి అశోక్‌రెడ్డిలు కలసి 29 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు తెలిపారు. వీటిలో 27 స్వాధీనం చేసుకోగా మరో రెండు స్వాధీనం చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ ముగ్గురు వ్యక్తులు తాడిపత్రి, అనంతపురం టౌన్, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, చాపాడు, కడప, కదిరి, పులివెందుల, తొండూరు, ఎర్రగుంట్ల ప్రాంతాల్లో వాహనాలను చోరీ చేసినట్లు తెలిపారు. ముగ్గురిని అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ వాహనాలు స్వాధీనం చేసుకునేందుకు సమాచారం రాబట్టి సహకరించిన ఎస్ఐ చిన్నపెద్దయ్య, పోలీసులు మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మేంద్ర, తిరుమలయ్య, ప్రసాదు, రాఘవరెడ్డి, గణేష్, నవీన్, మధులను డీఎస్పీ, సీఐ అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అఫిషియల్ స్పోక్‌పర్సన్‌గా సయ్యద్ అహ్మద్



రైల్వేకోడూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అఫిషియల్ స్పోక్‌పర్సన్‌గా డాక్టర్ సయ్యద్ అహ్మద్‌ను నియమించారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి నుంచి నియమకపత్రం వచ్చినట్లు బుధవారం ఆయన మీడియాకు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్, రైల్వేకోడూరు పార్టీ ఇన్‌చార్జ్ గోశాల దేవి, కాంగ్రెస్ రాష్ట్ర దళిత నాయకుడు శాంతయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ ఆర్బిట్రేటర్, కడప

DRK No.121/2023

M/s Viswapragathi Chit Funds Pvt. Ltd., Kadapa Rep. by its Legal Manager - Disputant

Vs

1) C.Tirumalaiah & Others - Opponents

Opponent No.1 కు నోటీసు

1)Chatakondu Tirumalaiah, S/o C. Chinnaiah, Aged About 44 Years, Hindu, R/At D.No. 8/32 , Itharam Peta, Setti Palli, Sambepalli, Kadapa. Working As Police Constable Asst Commandant, O/O XI Apsp Battalion, Bhakerapet, Kadapa.

డిస్ప్యూటెంట్ బాకీ మొత్తము రూ.11,68,440/-లు రాబట్టుకొనుటకు గాను మీపై దావా దాఖలు చేసిన డిస్ప్యూటెంట్‌లో Opponent 1 అయిన మీరు తేది: 30.04.2025న ఉదయం 11.00 గంటలకు The Hon'ble Deputy Registrar of Chits, O/o District Registrar, Registrar & Stamps Department, Kadapa, నందు మీరు హాజరై ఎటువంటి ఆక్షేపణలు వున్న యెడల తెలుపు కొనవలెను. అట్లు లేని యెడల మీ పై దావా పరోక్షంగా తీర్మానించబడును.

By Order of The Hon'ble Deputy Registrar of Chits,
O/o District Registrar,
Registrar & Stamps Department,
Budda Township, Kadapa.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ ఆర్బిట్రేటర్, కడప

DRK No.124/2023

M/s Viswapragathi Chit Funds Pvt. Ltd., Kadapa, Rep. by its Legal Manager - Disputant

Vs

1) Marella Sreenivasa Rao & Other's - Opponents

Opponent No.2 & 4 కు నోటీసు

2) Konesetty Chandra Sekhar, S/o K. Chennaiah aged about 50 years, Hindu, R/at D. No.2/261, T. Agraharam, Saraswathipuram, Rajampeta, Kadapa Dist. Working as School Assistant, Z.P.High School, Nandalur, Kadapa Dist.

4) Maripalli Sudhakar, S/o M.Subbarayachari, aged about 41 years, Hindu, R/at. D.No.171, Nukanapalli, Obulavaripalli Mandal, Kadapa Dist. Working as Hindi Pandit, M.P.U.P. School, Murarichinthala Village, Lingala Mandal, Kadapa

డిస్ప్యూటెంట్ బాకీ మొత్తము రూ.14,41,185/-లు రాబట్టుకొనుటకు గాను మీపై దావా దాఖలు చేసిన డిస్ప్యూటెంట్‌లో Opponent 2&4 అయిన మీరు తేది: 30.04.2025న ఉదయం 11.00 గంటలకు The Hon'ble Deputy Registrar of Chits, O/o District Registrar, Registrar & Stamps Department, Kadapa, నందు మీరు హాజరై ఎటువంటి ఆక్షేపణలు వున్న యెడల తెలుపు కొనవలెను. అట్లు లేని యెడల మీ పై దావా పరోక్షంగా తీర్మానించబడును.

By Order of The Hon'ble
Deputy Registrar of Chits,
O/o District Registrar, Registrar &
Stamps Department, Budda Township,
Kadapa.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/ ఆర్బిట్రేటర్, కడప

DRK No.148/2023

M/s Viswapragathi Chit Funds Pvt. Ltd., Kadapa, Rep. by its Legal Manager - Disputant

Vs

T. Saraswathi & Others - Opponents

Opponent No.1 & 2 కు నోటీసు

1) Talla Saraswathi , W/o T. Lakshmaiah, Aged About 63 Years, Hindu, R/ At Door No 1/191, B.C.Colony, Chakrapunayaipeta, Penagalur, Nandalur Mandal, Annamayya Dist.

2) Talla Aparna, D/o T. Lakshmaiah, Aged About 26 Years, Hindu, R/At D.No. 1/191, B.C.Colony, Pondalur, Nandalur Mandal, Annamayya Dist. Working as Attender, Tahsildar Office, Penagalur Mandal, Annamayyya Dist.

డిస్ప్యూటెంట్ బాకీ మొత్తము రూ.7,78,520/-లు రాబట్టుకొనుటకు గాను మీపై దావా దాఖలు చేసిన డిస్ప్యూటెంట్‌లో Opponent 1&2 అయిన మీరు తేది: 30.04.2025న ఉదయం 11.00 గంటలకు The Hon'ble Deputy Registrar of Chits, O/o District Registrar, Registrar & Stamps Department, Kadapa, నందు మీరు హాజరై ఎటువంటి ఆక్షేపణలు వున్న యెడల తెలుపు కొనవలెను. అట్లు లేని యెడల మీ పై దావా పరోక్షంగా తీర్మానించబడును.

By Order of The Hon'ble
Deputy Registrar of Chits,
O/o District Registrar, Registrar &
Stamps Department, Budda Township,
Kadapa.

అందరం కలిసికట్టుగా పనిచేయాలి

● మినీ గోకులం ప్రారంభోత్సవంలో చమర్తి జగన్‌మోహన్‌రాజు



చమర్తి జగన్‌మోహన్‌రాజుకు గజమాలతో స్వాగతం పలుకుతున్న మేకావారిపల్లె ప్రజలు

రాజంపేట, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అందరం కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గంలో టీడీపీకి పూర్వవైభవాన్ని తీసుకురావాలని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. బుధవారం మండలంలోని మేకావారిపల్లెలో మినీ గోకులాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు ఆయనకు గజమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజంపేటలో ప్రతిపక్ష పార్టీ అరాచకాలను ఎండగట్టి ముందుకు సాగాలన్నారు. ప్రతి గ్రామంలో సంక్షేమం, అభివృద్ధి పథకాలను ఇంటింటికి పంచి టీడీపీని బలోపేతం చేయాలన్నారు. రాజంపేట నియోజకవర్గంలో బలమైన కార్యకర్తలు, నాయకులు, ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు గీతాంజలి రమణ, జిల్లా కమ్మ సంఘం అధ్యక్షుడు రవికుమార్‌నాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోవాలి : పీడీ

పెనగలూరు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారు పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ సాంబ శివయ్య తెలిపారు. బుధవారం సాయంత్రం కొండూరు పంచాయతీ పరిధిలోని కేసీ సముద్రం ఎస్టీ కాలనీలో ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబంలో ఉంటూ కొత్త రేషన్‌కార్డు కలిగిన నూతన కుటుంబ సభ్యులు పక్కా గృహం పొందుటకు అర్హులన్నారు. 2014 నుంచి మంజూరై గృహాలను నిర్మించుకోకుండా అలా గే ఉంచుకున్న లబ్ధిదారులు వెంటనే గృహనిర్మా ణాలు ప్రారంభించి రెండు నెలల్లోగా పూర్తి చేసుకో వాలన్నారు. ఇందుకు ప్రభుత్వం అదనంగా రూ.75 వేలు మంజూరు చేసిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీకృష్ణ, పెనగలూరు ఏఈ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

సంబేపల్లె, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని రాయచోటి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీలత, సైంటిస్ట్ మాధురి తెలిపారు. బుధవారం మండలంలోని మోటకట్ల రైతు సేవా కేంద్రంలో సమగ్ర పంటల యాజమాన్యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు విత్తనశుద్ధి చేయాలన్నారు. ఒక కేజీ విత్తనానికి ట్రైకోడెమోగిడి 8 గ్రాములు, కార్బండిజం 3 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రేణుక, రెడ్డివెంకట్రమణ, సందీప్‌కుమార్ రెడ్డి, అంకితారెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిశీలకుడిగా కేకే చౌదరి



చిట్వేలి ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరిని నెల్లూరుసిటీ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమించడం పట్ల చిట్వేలి మండల నాయకులు, కార్యకర్తలు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేకే చౌదరి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి, నాయకులు, కార్యకర్తల సమన్వాయానికి కృషి చేస్తానని తెలిపారు.

నవమి వేడుకల్లో ప్రసాద్‌బాబు

చిన్నమండెం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకిబండ గ్రామం బలిజపల్లె గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు మంగళవారం రాత్రి శ్రీరామనవమి వేడుకలకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం పటం మెరవణి, బండి ఊరేగింపును ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న సుగవాసి ప్రసాద్‌బాబు

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

రామాపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకానికి ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఉపాధి హామీ ఏపీవో పెంచలయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన ఉపాధి హామీ కార్యాలయంలో మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకునే రైతులు ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉండాలని, చిన్న, సన్న కారు రైతులుగా తహసీల్దార్ ధ్రువీకరించాలని, ఐదెకరాల కంటే తక్కువ భూమి కలిగి ఉండాలని తెలిపారు. అలాగే భూమి ఫోటో, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కరెంటు బిల్లు జిరాక్స్, సాయిల్ టెస్టింగ్ కార్డులను దరఖాస్తుతో పాటు జత చేయాలన్నారు. మరిన్ని వివరాలకు ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మోడల్ కళాశాల విద్యార్థుల వంద శాతం ఉత్తీర్ణత



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోడల్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు. ఇంటర్ రెండో సంవత్సరం సీఈసీలో నాగేశ్వరి 929, శ్రావణి బైపీసీలో 898 మార్కులు, మొదటి సంవత్సరం సీఈసీలో హారిక 460/500, ఎం.కార్తీక 444/500, కె.నాగమణి 442/500, ఎంపీసీలో టి.రుషిత 441/600, కల్యాణ్‌బాబు 432, హఫీజున్ 430, భాను 421, జాలభానుప్రియ 414మార్కులు సాధించారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పనిముట్ల పంపిణీ

సిద్దవటం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం టక్కోలి గ్రామ సచివాలయ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పనిముట్లు పంపిణీ చేసినట్లు పంచాయతీ సెక్రటరీ శివయ్య తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా పనులు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం ఆయన పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ప్రతి వీధికి వెళ్లి చెత్త సేకరణ చేయాలని, గ్రామంలో ఆదివారం జాతర సందర్భంగా అన్ని ప్రాంతాల్లో శానిటేషన్ పనులు చేయాలన్నారు. అలాగే చెత్త సంపద కేంద్రం వద్ద జామ, ఉసిరి, వేప, కానుగ, దానిమ్మ, నేరేడు తదితర పండ్ల చెట్ల పెంపకం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి నాగమునిరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన ఉండాలి

రామాపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగివుండాలని ఎస్బీఐ లైఫ్ రిటైర్డ్ మేనేజర్ నాగరాజు అన్నారు. మండల పరిధిలోని బిట్స్ కళాశాల విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై ఆర్‌హెచ్‌జీబీఎంఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్బీఐ ఎల్డీయం ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఖాతాలకు నామినీ, ఆధార్, పాన్‌కార్డు, మొబైల్ నెంబర్లను అప్డేట్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌హెచ్‌జీబీయంఎస్‌ఎస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహాభారతానికి రూ.50 వేల విరాళం



దాతలను సన్మానిస్తున్న నిర్వాహకులు

గాలివీడు, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పంచమవేద మహాభారతం కార్యక్రమానికి ప్రభుత్వ ఉపాధ్యాయులు బుక్కపట్నం సుబ్రాయుడు, జానకీదేవి రూ.50 వేలు విరాళంగా అందించారు. బుధవారం మండలంలోని అరవీడు గ్రామం పాతపాలెంలో నిర్వహిస్తున్న పంచమవేద మహాభారతం కార్యక్రమాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి ఇతిహాసాల ప్రదర్శన ప్రజల్లో నైతికత విలువలు, సంస్కృతిని బలోపేతం చేయడంలో సహాయపడుతుందని స్పష్టం చేశారు.

ఉపాధి డబ్బులు చెల్లించాలని వినతి

సిద్దవటం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఏడు వారాలుగా చేసిన ఉపాధి పనులకు ఇంతవరకు డబ్బులు మంజూరు కాలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ ఉపాధి డబ్బులు మంజూరు కాక కుటుంబ పోషణ బరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై ఉపాధిహామీ ఏపీవో నరసింహులును వివరణ కోరగా జిల్లాలో అందరికీ ఇదే పరిస్థితి ఉందని, ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, మంజూరైన వెంటనే ప్రతిఒక్కరికి చెల్లింపులు చేస్తామన్నారు.

'ప్రతి ఒక్కరూ ప్రజాసేవకు ముందుండాలి'

నందలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు తమ వంతు ప్రజాసేవ చేయాలని సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలో విశ్రాంత రైల్వే ఉద్యోగి మాజీ రైల్వే భారత్ స్కౌట్ గ్రూప్ కమిషనర్ షేక్ కమాల్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలిరోజు ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అరవపల్లె షాదీఖానా అధ్యక్షుడు మహబూబ్‌బాషా, గుండ్లూరు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ముమ్మడి వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు షేక్ మౌలాన, పల్లె నాగయ్య, కానకుర్తి వెంకటయ్య ప్రజలు పాల్గొన్నారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

చిట్వేలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిట్వేలి గాజుల వీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతా రామ లక్ష్మణ హనుమంతు సమేత విగ్రహ ధ్వజ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు బుధ, గురువారాలు పూజా కార్యక్రమాలు, శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ముందుగా స్థానిక శివాలయం నుంచి నూతన విగ్రహాలు, కలశాలతో గ్రామోత్సవంగా తరలివెళ్లారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దోబీఘాట్ బోరు, మోటారుకు మరమ్మతులు చేయాలి

రాయచోటిటౌన్, ఏప్రిల్16(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణ పరిధిలోని గున్నికుంట్ల రోడ్డులో ఉన్న దోబీఘాట్ బోరు, మోటారుకు మరమ్మతులు చేయాలని రజక సంఘం నేతలు రమేశ్‌బాబు, వీరబల్లి శ్రీనివాసులు, ఆనంద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ వాసుబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా బోరు, మోటారు పనిచేయక అక్కడ బట్టలు ఉతికి జీవనోపాధి పొందుతున్న రజకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే మిగిలిన దోబీఘాట్ల వద్ద కూడా తగిన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం రాయచోటి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. పని గంటలు పెంచి కేవలం రూ.15 వేల వేతనం ఇస్తున్నారని, పారిశుధ్య కార్మికులతో పాటు రూ.21 వేల వేతనం ఇవ్వాలన్నారు. వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచి ఆప్కాస్ కొనసాగించాలని, లేద పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రక్షణ పరికరాలతో పాటు నాణ్యమైన పనిముట్లు సరఫరా చేయాలన్నారు. వాటర్ సెక్షన్ అధ్యక్షుడు అక్బర్, కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కార్మికులు దేవా, రమేశ్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, మౌనిక, రమణ పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ వయస్సు పెంచాలి



సమస్యలపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల రిటైర్‌మెంట్ కాలపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలపై నిర్వహిస్తున్న నిరసనలో భాగంగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా ఆప్కాస్ పనిచేస్తున్న కార్మికులకు కొత్త ప్రభుత్వం కాంట్రాక్టు విధానాన్ని కొనసాగించాలని నిర్ణయించడం అన్యాయమన్నారు. దీనివల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ, జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి, యూనియన్ నాయకులు ప్రసాద్, ప్రమీలమ్మ, రమణమ్మ, రెడ్డయ్య, కోటయ్య, జి.రమణ, కోదండం, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, వామపక్ష నాయకులు

రాజంపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమాఖ్య 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు దార్ల రాజశేఖర్, జక్కల వెంకటేష్ పేర్కొన్నారు. స్థానిక కాకతీయ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్, కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి చేతులమీదుగా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత యువజన సమైక్య 1959 మే 3న ఆవిర్భవించి ఎన్నో ఉద్యమాలు చేయడం జరిగిందన్నారు. తిరుపతిలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాజంపేట నియోజకవర్గ కార్యదర్శి శివరామ కృష్ణదేవర, ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శెట్టిపల్లె పెంచలయ్య, ఆటో యూనియన్ లీడర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం

నందలూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడిపల్లె మేజర్ పంచాయతీ అరవపల్లెలో క్రీడామైదానం వద్ద వెలసిన కోదండరామస్వామి ఆలయం శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామికి వసంతోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో పెద్దలు, యువకులు, పిల్లలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా గ్రామోత్సవంలో పాల్గొన్నారు. మేళతాళాలు, బాణసంచా నడుమ ఊరేగింపు స్థానిక బస్టాండు కూడలి వరకు కొనసాగింది. భక్తులు కాయ కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కంచాలమ్మ చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

● రాష్ట్ర జలవనరులశాఖ మంత్రిని కోరిన మదన్‌మోహన్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణానికి ఎగువ భాగంలో ఉన్న కంచాలమ్మ గండి చెరువును, మాండవ్యనది అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును అర్చనా విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం విజయవాడలో మంత్రిని మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా కంచాలమ్మ గండిచెరువు కింద 500 ఎకరాల ఆయకట్టు భూమి ఉందని, సాగు, తాగునీరు చెరువుగా అభివృద్ధి చేయాలని, రాయచోటి పట్టణానికి కూతవేట దూరంలో ఉండడం, నగరవనం ప్రక్కనే ఈ చెరువు ఉన్నందున పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలు మేఘనాథరెడ్డి, బసిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న మదన్‌మోహన్‌రెడ్డి

స్వయం ఉపాధి... భవితకు వారధి

● మహిళల ఆర్థిక భరోసాకు ప్రభుత్వం చేయూత
● జీవనోపాధుల రుణ ప్రణాళిక అమలుకు సర్వే ముమ్మరం


మైలవరంలో శిక్షణ పొందుతున్న ఎన్యుమరేటర్లు

మైలవరం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. సంఘాల్లోని మహిళలకు పెద్ద ఎత్తున రుణాలు అందించి వారి ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వార్షిక రుణ జీవనోపాధుల ప్రణాళిక అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం సంఘాల సభ్యుల్లోనే యానిమేటర్లను ఎన్నుకుని వారితో జీవనోపాధుల రుణ ప్రణాళికను చేపట్టారు. ఈనెల మొదటి వారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న 35 మండలాల్లో ప్రారంభమైన సర్వే మరో నాలుగు రోజుల లోపు పూర్తి చేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

రుణాలు ఇలా...

స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు ఇప్పటి వరకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి వంటి పథకాల కింద బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. వీటితో పాటు పొదుపును కూడా రుణంగా వినియోగించుకోవాలని సూచిస్తున్నాయి. ప్రస్తుతం రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు సంఘాల సీనియార్టీ ప్రకారం బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి.

180 రకాల వ్యాపారాలకు అవకాశం...

ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రుణ జీవనోపాధుల అమలుకు సర్వే చేపట్టింది. మొత్తం 20 రంగాల్లో దాదాపు 180 రకాల వ్యాపారాలకు ప్రస్తుతం అవకాశం కల్పిస్తోంది. ముఖ్యంగా వ్యవసాయం, పట్టుపరిశ్రమ, చేపల పెంపకం, ఉద్యానం, లైవ్‌స్టాక్, తయారీ రంగం, సేవల రంగాల్లో హస్తకళలు, చేతివృత్తులు తదితర వ్యాపారాలు చేసుకునేందుకు ఈ సర్వే ద్వారా అవకాశం ఏర్పడుతుంది. సంఘంలోని మహిళల్లో పది, ఇంటర్ వరకు చదువుకున్న వారిని ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. వీరి ద్వారా సర్వే చేస్తున్నారు.

జిల్లాలో సర్వే వివరాలు ఇలా..

మండలాలు	- 35
గ్రామ సమాఖ్యలు	- 1105
సంఘాలు	- 27,582
సభ్యులు	- 2,73,200 మంది
సర్వేచేస్తున్న ఎన్యుమరేటర్లు	- 4,725
సర్వే పూర్తయిన సభ్యులు	- 2,61,774 మంది
సర్వే శాతం	- 75.85 శాతం

(సోమవారం 5 గంటల వరకు)

ప్రభుత్వానికి నివేదిస్తాం..

వార్షిక జీవనోపాధుల సర్వే పూర్తయితే ఒక నిర్దేశిత ప్రణాళిక తయారు చేస్తాం. దాని ప్రకారం సంఘాల్లోని సభ్యులకు జీవనోపాధుల కోసం రుణాలు అందించి.. మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తాం. త్వరగా సర్వే పూర్తి చేసి నివేదికలు ప్రభుత్వానికి పంపుతాం.

- ఆనందనాయక్, డీఆర్‌డీఏ పీడీ, కడప

ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం


మాట్లాడుతున్న స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ సురేష్‌బాబు

సిద్దవటం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ సురేష్‌బాబు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై మహిళా సమాఖ్యలతో భాగ స్వామ్యం ఒప్పందం కుదుర్చుకోవడం జరిగిందన్నారు. రైతుసాధికార సంస్థ స్వయం సహాయక సంఘాలు, గ్రామ సమాఖ్య సంఘాలతో సంప్రదించి ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేస్తుందన్నారు. రైతు సాధికార సంస్థ గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసే రైతులను కమ్యూనిటీ రీసోర్స్‌పర్సన్(సీఆర్‌పీ)లుగా తీసుకుని వారి ద్వారా అమలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్వీ ప్రవీణ్, అదనపు ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి, బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు, మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, ఏపీఎం సుజాత, మండల సమైఖ్య అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

విద్యార్థులు గొప్పవారి చరిత్రను చదవాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో గొప్పవారి చరిత్రలు చదివి వారి ఆదర్శనీయమైన ఆలోచనలను జీవితానికి అన్వయించుకొని అనుసరించాలని వైవీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ అన్నారు. బుధవారం వైవీయూ లలిత కళల శాఖలో కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా నాటక రంగ దినోత్సవం నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి రిజిస్ట్రార్ పద్మ, డీన్ గంగయ్య, శాఖ హెడ్ మృత్యుంజయరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం బాల్య వివాహాలను నిషేధించడం, వితంతు వివాహాలను ప్రోత్సహించడంతో పాటు బాలికల విద్య కోసం కృషి చేసిన మహానుభావుడన్నారు. కార్యక్రమంలో లలిత కళల శాఖ అధ్యాపకులు సీహెచ్ వెంకటేష్, చినరాయుడు, ఈరప్ప, వాసవి, చంటి సూరి, సిద్ధిరాజ్ టెక్నికల్ అసిస్టెంట్ సుధాకర్,ఆఫీస్ సిబ్బంది లక్ష్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలి


స్కూల్ ఎడ్యుకేషన్ జేడీ సర్వీసెస్ పార్వతికి వినతి పత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ కేడర్‌లో జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని నోబుల్ టీచర్స్ అసోషియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావులు స్కూల్ ఎడ్యుకేషన్ జేడీ సర్వీసెస్ పయ్యావుల పార్వతికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కొన్ని సంవత్సరాలుగా ఉపాధ్యాయులు, వారి కుటుంబాలకు దూరంగా ఉన్నారని, భార్య, భర్తలు కొన్ని సంవ త్సరాలుగా వారి పిల్లలకు దూరంగా ఉండటం దృష్ట్యా వెంటనే ఈ వేసవి సెలవుల్లో అంతర్ జిల్లల బదిలీలు చేపట్టాలని కోరారు. అలాగే మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న ఉపాధ్యా యులకు ఈ వేసవి సెలవుల్లో బదిలీలు చేపట్టాలని కోరారు. ఎన్‌టీఏ నేతల వినతికి స్కూల్ ఎడ్యుకేషన్ జేడీ సర్వీసెస్ పార్వతి సానుకూలంగా స్పందించారని వారు తెలియజేశారు.

వీఆర్వోపై దాడి కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోపై దాడి కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు, రూ.10వేలు జరిమానా విధిస్తూ తంబళ్లపల్లె సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్‌ఫరూక్ బుధవారం తీర్పు ఇచ్చారు. ఏపీపీ కథనం మేరకు.. పెద్దతిప్పసముద్రం మండలం రేకులకుంటపల్లెకు చెందిన సీత వెంకట్రమణారెడ్డి 2015లో ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడు. ఈ విషయమై ప్రశ్నించినందుకు వీఆర్వోపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పీటీఎం పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. బుధవారం విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో వెంకట్రమణారెడ్డికి 6 నెలల జైలు శిక్షతో పాటు రూ.10వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.


మూలవంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జగదీష్, మౌలాలిని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

రక్తమోడిన రహదారులు

● వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి ● పలువురికి తీవ్ర గాయాలు


మౌలాలి, జగదీష్ (ఫైల్ ఫొటోలు)

సీకేదిన్నె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. కడప- రాయచోటి జాతీయ రహదారిలోని బుగ్గలేటి పల్లె వద్ద స్కూటర్‌ను బొలెరో వాహనం ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. సీకేదిన్నె సీఐ శివశంకర్ నాయక్ వివరాల మేరకు... మూలవంక గ్రామానికి చెందిన వేంపల్లె మౌలాలి (19), వెంకట జగదీష్ (20) మంగళవారం అర్ధరాత్రి బుగ్గలేటి సమీపంలోని డాబాకు వెళ్లి భోజనం చేసి తిరిగి కడప వైపు వస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బొలెరో వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ఇరువురికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీకేదిన్నె పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో చికిత్స నిమిత్తం తరలించారు. జగదీష్ ఆస్పత్రికి చేరుకునేలోపే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మౌలాలి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబీకులకు అప్పగించారు. ఇద్దరిది ఒకే ఊరు కావడంతో మూలవంక గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. వెంకట జగదీష్ బెంగుళూరులో బీబీఏ చదువుతున్నాడు. ఇతని తండ్రి శ్రీరాములు కరోనాలో మృతి చెందగా.. తల్లి కష్టపడి జగదీష్‌ను చదివిస్తోంది. మౌలాలి ఇంటర్ వరకు చదువుకుని సీసీ కెమెరాల కంపెనీలో పనిచేస్తూ చదువుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. ఇరువురు స్నేహితుల మరణం కుటుంబీకులను, గ్రామస్తులను ఎంతగానో కలచివేసింది.

అవయవ దానం: రోడ్డు ప్రమాదంలో మరణించిన మౌలాలి కళ్లను వారికుటుంబ సభ్యులు దానం చేశారు. పలువురికి జీవితాన్ని ఇవ్వాలనే మౌలాలి చివరి కోరిక మేరకు వారి కుటుంబ సభ్యులు కళ్లను దానం చేశారు. ఇంతటి బాధతలో కూడా కుటుంబ సభ్యులు అవయవ దానం చేయడం పట్ల గ్రామస్థులు అభినందించారు.

ఆటోను ఢీకొన్న మినీ లారీ.. మహిళ మృతి



చెన్నూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు అరుంధతీనగర్‌కు చెందిన లక్ష్మీ గాండ్ల బాలమ్మ (45) అనే మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కడప నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో కూలీగా పనిచేస్తున్న ఈమె రోజూ ఉదయమే 5గంటల్లోపే హోటల్‌కు పనిచేసేందుకు వెళుతుండేది. ప్రతి రోజు లాగే బుధవారం ఉదయం స్థానిక కొత్తరోడ్డులో ఆటో ఎక్కింది. ఆమెతో పాటు చెన్నూరు కొత్తగాంధీనగర్‌కు చెందిన ముగ్గురు మహిళలు అదే ఆటోలో వివిధ రకాల పనుల కోసం ఆటో ఎక్కారు. అదే సమయంలో మైదుకూరు వైపు నుంచి కడపకు వెళుతున్న మినీ లారీ వేగంగా వచ్చి ఆటో వెనుక వైపు ఢీకొంది. ఈ సంఘటనలో బాలమ్మ సంఘటనాస్థలంలో మృతి చెందగా.. డ్రైవరు పాలం రాజు, ఎద్దుల వెంకటేశ్‌తో పాటు తుమ్మలూరు సుబ్బమ్మ, వెంకటసుబ్బమ్మలు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కడపకు తీసుకెళ్లారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు.

ట్రాక్టరు ఢీకొనడంతో మహిళ...


సరోజమ్మ మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తె

కమలాపురం రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): నగర పంచాయతీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సరోజమ్మ (48) అనే మహిళ మృతి చెందింది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని రామ్‌నగర్ కాలనీకి చెందిన సరోజమ్మ బుధవారం తన కుమార్తెతో స్కూటీపై వెళుతుండగా రైల్వేగేటు సమీపాన ట్రాక్టరు ఢీకొంది. దీంతో ఆమె ట్రాక్టరు కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. కమలాపురం ఎస్‌ఐ విద్యాసాగర్ సంఘటనాస్థలానికి చేరు కుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. కాగా, మృతురాలికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ...తల్లీ కొడుకుకు తీవ్ర గాయాలు

చెన్నూరు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషయ్యగారిపల్లె వద్ద జాతీయ రహదారిపై బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో తల్లీ కొడుకుకు తీవ్ర గాయాలయ్యాయి. అలంఖాన్‌పల్లెకు చెందిన చాగలమర్రి పెద్దవీరయ్య (26) తన పెళ్లి శుభలేఖలు ఇచ్చేందుకు తల్లి ఫక్కీరమ్మ (45)తో కలసి ద్విచక్ర వాహనంలో మైదుకూరు బయలుదేరాడు. శేషయ్యగారిపల్లె వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ సంఘటనలో పెద్దవీరయ్య, ఫక్కీరమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమత్తం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హౌసింగ్ పనులు వేగవంతం చేయాలి

చిట్వేలి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ వి.సాంబశివయ్య అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీలకు ప్రస్తుతం ఇస్తున్న 1.80 లక్షలతో పాటు అదనంగా 50 వేల రూపాయలు, అలాగే ఎస్టీలకు 70 వేల రూపాయలు అదనంగా ప్రభుత్వం అమలు పరుస్తుందన్నారు. గ్రామాల్లో లేనివారికి అవగాహన కల్పించి నూతనంగా పొజిషన్ పెంచేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పనులు వేగవంతం చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట డివిజన్ ఈఈ మురళీకృష్ణ, చిట్వేలి హౌసింగ్ ఏఈ సుధాకర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

మేడా రామలక్షుమ్మ నేత్రదానం


మృతురాలి నుంచి కార్నియాలను సేకరిస్తున్న దృశ్యం

పులివెందుల టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్ర జ్యోతి): పులివెందుల పట్టణంలోని అంకాలమ్మపేటకు చెందిన మేడా రామలక్షుమ్మ (86) మరణించడంతో ఆమె కుటుంబీకులు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృతహస్తం సేవా సమితి వారికి సమాచారం ఇచ్చారు. ఈ మేరకు మృతురాలి పార్థీవ దేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలు దానం చేసేందుకు ప్రతి కుటుంబం ముందుకు రావాలన్నారు. నేత్రదానం చేయదలుచుకున్న వారు 7093204537 లేదా 9966500364లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్ బుసిరెడ్డికి అరుదైన గౌరవం


ప్రిన్సిపాల్ నుంచి రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలో సర్టిఫికేట్ అందుకుంటున్న సుధాకర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాల భౌతికశాస్త్ర ప్రొఫెసర్ శాస్త్రవేత్త బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డికి మరోసారి అరుదైన గౌరవం లభించింది. ప్రపంచవ్యాప్తంగా 50వేల మంది సభ్యు లుగా ఉండే రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో ఫెలోగా అవకాశం దక్కిం చుకున్న ఈయన తాజాగా సొసైటీ వారు మెటీరియల్ కెమిస్ట్రీ, ఫిజిక్స్ విభాగాల్లో చేసిన ప్రతిభను గుర్తించి ఎఫ్‌ఆర్‌ఎస్సీ (ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ) అందించారు. దీనికి సంబంధించిన సర్టిఫికేట్‌ను అదేవిధంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే రాయల్ సొసైటీ బ్యాడ్జిను డాక్టర్ బుసిరెడ్డికి పంపారు. బుధవారం కడపనగరం ప్రభుత్వ పురుషుల కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ బ్యాడ్జిని డాక్టర్ బుసి రెడ్డికి తగిలించడంతో పాటు సర్టిఫికేట్‌ను అందించి అభినందించారు. ఈ సందర్భంగాపలువురు అధ్యాపకులు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేష్


సురేష్‌ను అభినందిస్తున్న కోనూరు సతీష్‌శర్మ

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కడప నగరానికి చెందిన ఎంఎల్ఎన్ సురేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడుపర్యాయాలు యువజన విభాగ అధ్యక్షుడిగా సురేష్‌బాబు పనిచేశారు. మంగళవారం ఏలూరులో రాష్ట్రస్థాయి సేవా సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సురేష్ బాబుకు రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ నియామక ఉత్తర్వులు అందేశారు. 2025, 2026 రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో సాగుతారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద బ్రాహ్మణుల అభ్యున్నతికి పాటు పడతానని తెలిపారు.

అంతర్ జిల్లాల బైకు దొంగల అరెస్టు

● 27 ద్విచక్రవాహనాలు స్వాధీనం ● మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ వెల్లడి


మాట్లాడుతున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్, స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

చాపాడు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అనంతపురం, సత్యసాయి, కడప జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివశంకర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం వారు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చాపాడు మండలంలోని అల్లాడుపల్లె దేవాలయం క్రాస్‌రోడ్డు వద్ద ప్రొద్దుటూరు, మైదుకూరు జాతీయ రహదారిపై ట్రైనింగ్ డీఎస్పీ భవానీ వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గు రు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి అరెస్టు చేసి విచారించగా.. ద్విచక్రవాహనాల చోరీ విషయం బయటపడినట్లు తెలిపారు. లింగాల మండలం వెలిదండ్ల గ్రామానికి చెందిన కర్ణ పవన్‌కుమార్‌రెడ్డి, కర్ణ లోకనాథ్‌రెడ్డి, పులివెందుల పట్టణం రాజారెడ్డి కాలనీకి చెందిన గంగిరెడ్డి అశోక్‌రెడ్డిలు కలసి 29 ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు తెలిపారు. వీటిలో 27 స్వాధీనం చేసుకోగా మరో రెండు స్వాధీనం చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ ముగ్గురు వ్యక్తులు తాడిపత్రి, అనంతపురం టౌన్, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, చాపాడు, కడప, కదిరి, పులివెందుల, తొండూరు, ఎర్రగుంట్ల ప్రాంతాల్లో వాహనాలను చోరీ చేసినట్లు తెలిపారు. ముగ్గురిని అరెస్టు చేసి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ వాహనాలు స్వాధీనం చేసుకునేందుకు సమాచారం రాబట్టి సహకరించిన ఎస్‌ఐ చిన్నపెద్దయ్య, పోలీసులు మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మేంద్ర, తిరుమలయ్య, ప్రసాదు, రాఘవరెడ్డి, గణేష్, నవీన్, మధులను డీఎస్పీ, సీఐ అభినందించారు.

కందుకూరికి ఘన నివాళి

వాల్మీకిపురం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చింతపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభు చరణ్, హెచ్ఎం రెడ్డెప్పరెడ్డి, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, దామోదర్, యోగరంజని, రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

టైపిస్టుకు సన్మానం

పీలేరు రూరల్ 16 (ఆంధ్రజ్యోతి) ఉత్తమ పనితీరుతో కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్న చీకటపల్లె నవకాంత్‌ను పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శివశంకర్ ఆధ్వర్యంలో సన్మానించారు. బదిలీపై పీలేరుకు వచ్చిన మూడున్నర నెలల్లోనే ప్రశంసా పత్రం అందుకోవడం గర్వకారణమని ప్రశంసించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏపీ స్టెనో, టైపిస్ట్ అసోసియేషన్ సభ్యులు కూడా సన్మానించారు.

డీఎస్పీని కలిసిన కాంగ్రెస్ నేతలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి):మదనపల్లె డీఎస్పీని బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు నిగార్ సుల్తానా రెడ్డి, సీనియర్ నాయకులు సింగరం రామకృష్ణారెడి డీఎస్పీ మహేంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. మదనపల్లెలో బెట్టింగ్‌లు, జూదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): శక్తియాప్‌పై బుధవారం స్థానిక చైతన్య నర్సింగ్ కళాశాలలోని విద్యార్థులకు శక్తి టీం ఇన్‌చార్జి ఎస్ఐ గాయత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమస్యలను వెంటనే పోలీసుల దృష్టికి తీసుకెళ్లడానికి శక్తి యాప్ ఉపయోగపడుతుందన్నారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించారు. బస్సులు, ఆటోలు, బస్టాండుల్లో ఆకతాయిల అఘాయిత్యాలపై శక్తి యాప్ ద్వారా ఎలా రక్షణ పొందాలో వివరించారు.

గంగమ్మ సన్నిధిలో తెలుగు యువత అధ్యక్షుడు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పాలేటి గంగమ్మ ఆలయాన్ని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు దర్శించుకున్నారు. బుధవారం మండలంలోని చిప్పిలి గ్రామంలో పాలేటి గంగమ్మ ఆలయాన్ని ప్రారంభించారు. వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ సమావేశాన్ని విజయవంతం చేయండి

పీలేరు రూరల్ 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎంఆర్‌పీఎస్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పీలేరు నియోజక వర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేశ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18న పట్టణ శివారులోని టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

షాదీమహల్ నిర్మాణం..
శిలాఫలకానికే పరిమితం!


షాదీమహల్ నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం

రామసముద్రం , ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ముస్లింలు శుభకార్యాలు చేసుకునేందుకు మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన షాదీమహల్ ఒకటిన్నర దశాబ్ద కాలంగా శిలా ఫలకానికే పరిమితమైంది. మండల కేంద్రంతోపాటు చెంబకూరు, తిరుమల రెడ్డిపల్లె, గొల్లపల్లె, ఊలపాడు, మినికి తదితర గ్రామాలలో సుమారు రెండు వేల దాకా పేద, మధ్యతరగతి ముస్లిం కుటుంబాలున్నాయి. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు చేసుకునేందుకు ఫంక్షన్ హాళ్లకు వేలకువేలు ఖర్చు పెట్టే స్తోమత లేకపోవడంతో, తమ ఇళ్ల వద్ద చాలీచాలని స్థలంలోనే ఆయా కార్యక్రమాలు చేసుకుంటున్నారు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా అప్పటి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా రామసముద్రం పుంగనూరు మార్గంలోని శానిఫారం వద్ద షాదీమహల్‌కు స్థలాన్ని కేటాయించారు. పనులు ప్రారంభించేలోపు ఆయన పదవీకాలం ముగియడంతో పనులు చేపట్టలేకపోయారు. అనంతరం 2014లో టీడీపీ హయాంలో మదనపల్లె ఎమ్మెల్యేగా వైసీపీ అభ్యర్థి దేశాయి తిప్పారెడ్డి ఎన్నికయ్యారు. ఈయన మండల పర్యటనకు వచ్చినప్పుడు షాదీమహల్ విషయం స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన షాదీమహల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే నవాజ్ బాషా, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డితో కలిసి షాదీమహల్ నిర్మాణం కోసం భూమి చేసి శిలాఫలకం వేశారు. పది లక్షల రూపాయలు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. అయితే అదీ కార్యరూపం దాల్చకపోవడంతో షాదీమహల్ నిర్మాణం శిలాఫలకానికే పరిమితమైంది. ప్రభుత్వాలు, ఎమ్మెల్యేలు మారినా సమస్య తీరడం లేదని, ఇప్పటి ప్రభుత్వమైనా చర్యలు తీసుకోవాలని ముస్లింలు కోరుతున్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయండి

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘువేంద్ర


సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘువేంద్ర

పీలేరు రూరల్ 16 (ఆంధ్రజ్యోతి); తప్పు లు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయా లని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాఘ వేంద్ర ఆదేశించారు. బుధవారం పీలేరు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలలో 1200 ఓట్లు మించకుండా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇలాంటివి 20 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు. ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ అని, ఆయా బూత్‌లెవల్ అధి కారులను సంప్రదించి మార్పులు చేర్పులు, తొలగింపులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో పీలేరు తహసీల్దార్ భీమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి: హౌసింగ్ డీఈ


సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ రమణయ్య

పీలేరు రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి); మన ఇళ్లు మన గౌరవం కార్యక్రమంలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని పీలేరు హౌసింగ్ డీఈ రమణయ్య తెలిపారు. బుధవారం పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పీలేరు మండలంలోని 15 పంచాయతీల్లో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నెలలో మూడవ శనివారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ర్యాలీలు, మానవహారం, అవగాహనా సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రింటర్లు, ఈ ర్యాక్‌లు విధిగా శుభ్రం చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలపై సర్వేలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఎంపీడీవో సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శివశంకర్, డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇరగన్న, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు అప్పగిస్తే వాటి యజమానులపై కేసులు నమోదు చేయనున్నట్లు పోలీసు ఇన్‌స్పెక్టర్ కె.రెడ్డిశేఖర్ రెడ్డి హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ కనబడితే వాహనాలు సీజ్ చేయడంతోపాటు వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆటో డ్రైవర్లు, వాహన యజమానులకు ఇటీవల విడుదలైన రహదారి నియమాలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే రూ.5 వేలు జరిమానా విధిస్తామన్నారు. ప్రతి వాహనంలోనూ పొల్యూషన్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లతోపాటు అవసరమైన అన్ని రకాల డాక్యుమెంట్లు తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. పట్టణంలో మితిమీరిన వేగంతో వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. స్థానిక పోలీసులు, ఆటో డ్రైవర్లు, పలు వాహనాల యజమానులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ముందస్తు చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య రాకుం డా ముందస్తు చర్య లు తీసుకోవాలని ఎంపీడీవో పరమేశ్వర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రెడ్డెప్ప ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యద ర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య ఎక్కడ ఉన్నా వెంటనే పరిష్కారం చూపాలన్నారు. పైపులైన్ లీకేజీలుంటే వెంటనే మర మ్మతులు చేయాలన్నారు. స్వచ్ఛభారత్ కింద మంజూరు అయిన 32 మరుగు దొడ్ల నిర్మాణం వెంటనే పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో పారి శుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిథున్ చక్రవర్తి, సహాయకులు గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

నిమ్మనపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈ రమేష్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా కొంత మొత్తాన్ని మంజూరు చేసిందని ఆ మొత్తంతో అసంపూరిగా ఇళ్లను పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు ఎన్టీఆర్ ఇళ్లకు సంబందించి 600 వందల వరకు దరఖాస్తులు వచ్చాయని వాటిని ఆన్‌లైన్ చేస్తున్నామని, సకాలంలో పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వక పోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి సిద్ద సమాధి యోగా శిక్షణ తరగతులు

కలికిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీ నుంచి కలికిరిలో సిద్ద సమాధి యోగా (ఎస్ఎస్‌వై) శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కన్యకా పరమేశ్వరి ఆలయానికి అనుబంధంగా ఉన్న కల్యాణ మండపంలో ఆదివారం సాయంకాలం 5.30 గంటలకు తరగతులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ప్రముఖ ఎస్ఎస్‌వై గురువు పుల్లయ్య గురాజీ ఆధ్వర్యంలో ఈ తరగతులు జరుగనున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఈ ప్రత్యేక తరగతులు నిర్వహించ నున్నామని చెప్పారు. ఇతర వివరాలకు 9391054184 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

సంక్షేమం, అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేయాలి

పెద్దమండ్యం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి) ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేయాలని పెద్దమండ్యం ఎంపీపీ పూర్ణచంద్రిక రమేష్ పిలుపు నిచ్చారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీధర్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలన్నారు. పల్లెపండుగ కింద మండలానికి నిధులు తక్కువగా మంజూరయ్యాయన్నారు. తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ మాట్లాడుతూ పక్కాగృహ నిర్మాణాలకు సకాలంలో పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తున్నట్లు తెలిపారు. రీసర్వే సమయంలో రైతులు సంబంధిత పత్రాలు లేదా పాసుపుస్తకాలు చూపించాలన్నారు. ఎంఈవో మనోహర్ మాట్లాడుతూ మండలంలో 11 ప్రైమరీ మోడల్ స్కూళ్లు మంజూరైనట్లు తెలిపారు. పీఆర్ ఇన్‌చార్జ్ ఏఈ షాబాజ్ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులకు రూ. 7 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదన చేసినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ మాట్లాడుతూ పాపేపల్లి దేవస్థానం సమీపంలో, మౌలాకా పహాడ్ వద్ద మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ. 6 లక్షలు , తాగునీటి పైపులైన్లు తదితర అభివృద్ధి పనులకు రూ. 63 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. తాగునీటి పథకాల బోర్లకు ట్రాన్స్‌పార్మర్ల ఏర్పాటుకు పంచాయతీల ద్వారా డీడీలు చెల్లించాలన్నారు. పక్కా గృహాల నిర్మాణాలు సకాలంలో పూర్తిచేయాలని హౌసింగ్ ఏఈ అక్రం తెలిపారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో కృష్ణయ్య మాట్లాడుతూ ఉపాధి కూలీలు వడదెబ్బ తగలకుండ జాగ్రత్త పడాలన్నారు. ఎఫ్ఈఎస్ స్వచ్ఛంద సంస్థ పలు చెరువులు పూడ్చేస్తోందని మండల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు రుక్మాంగదరెడ్డి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు లేక చిన్నారులు ఇక్కట్లు పడుతున్నట్లు దిగువపల్లి సర్పంచ్ బండి వాసవి తెలిపారు. ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధి పనుల కోసం వినతిపత్రాలు అందజేయాలని కూటమి అభివృద్ధి కమిటీ సభ్యులు విశ్వనాథ, సిద్దవరం ప్రసాద్, లక్ష్మీనారాయణ, శంకర సూచించారు. గతంలో రద్దు చేసిన బెంగుళూరు ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరిం చాలని సర్పంచ్ బాషా కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు పీరమ్మ, వైఎస్ ఎంపీపీ జయచంద్రారెడ్డి, శారద, మండల కోఆప్షన్ ఖాదర్‌వలీ, ట్రాన్స్‌కో ఈఏ రామూర్తినాయక్, ఏపీఎం నరసింహులు, ఆర్ఐ సయ్యద్‌ఇమ్రాన్, ఏఈ అక్రం పాల్గొన్నారు. గత రెండు సమావేశాలు వాయిదా పడిన నేపథ్యంలో ములకల చెరువు, కొత్తకోట సీఐలు లక్ష్మన్న, జీవన్ గంగనాథ్‌బాబు, నలుగురు ఎస్ఐలు 50 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా సాధికార కమిటీ సభ్యులు పనిచేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద టీడీపీ కార్యాలయంలో సాధికార కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 30 ఇళ్లకు ఒక సాధికార కమిటీని ఏర్పాటు చేస్తామ న్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న , అమలు చేయనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

నిధుల స్వాహాపై డీఆర్‌డీఏ పీడీకి ఫిర్యాదు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన మొత్తాన్ని మాజీ సంఘమిత్ర శారద దుర్వినియోగం చేసిందని ఏపీఎం మురళి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. అగ్రహారం పంచాయతీ పరిధిలోని నవోదయ సంఘమిత్రగా పనిచేసిన శారద రికార్డుల ప్రకారం దాదాపు రూ.10 లక్షల వ్యత్యాసం వచ్చినట్లు గుర్తించామన్నారు. ఈ విషయంపై పలుమార్లు ప్రశ్నించగా గత నెల 20న చెల్లిస్తానని ఆమె రాసిచ్చిందన్నారు. అయితే, రూ.3.5 లక్షలు మాత్రమే చెల్లించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. రికార్డులు అప్పగించకపోగా, నిధుల దుర్వినియోగంపై డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణకు ఫిర్యాదు చేశామన్నారు.

పాలేటమ్మ విగ్రహ ప్రతిష్ఠకు విరాళం


చెక్కు అందజేస్తున్న పీఎస్ఆర్ గ్రూప్స్ అధినేత శివశంకర్, ప్రసన్న

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పిలి పాలేటమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు బెంగళూరుకు చెందిన పీఎస్ఆర్ గ్రూప్స్ అధినేత రూ.1.50 లక్షలు విరాళం అందజేశారు. బుధవారం చిప్పిలి పాలేటమ్మ ఆలయానికి చేరుకున్న పీఎస్ఆర్ గ్రూప్స్ చైర్మన్ పెద్దపల్లె శివశంకర్‌రెడ్డి, పీసీ లక్ష్మీప్రసన్న దంపతులు రూ.1.50 లక్షల చెక్కును గంగమ్మ భక్త సంఘం అధ్యక్షుడు ఎన్.విశ్వనాథరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలకు తమ గ్రూపు సంస్థల తరపున ఇతోధికంగా సాయం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ రవీంద్రరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, అరుణ్‌కుమార్. జశ్వంత్, ఆనంద్‌రెడ్డి కిరణ్, గుణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే దళితుల సంక్షేమం


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితుల సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుద్దిళ్ల సుధాకర్ తెలిపారు. బుధవారం స్థానిక టీడీ పీ కార్యాలయంలో దళిత నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. త్వరలో విడుదల కానున్న డీఎస్సీ నోటిఫికేషన్‌తోనే విద్య ఉద్యోగాల్లో రిజర్వే షన్లు సమానంగా అందేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారన్నా రు. టీడీపీ నాయకులు తలారి రాధా, రాజేష్, పవన్, నరసింహులు, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోతబోలు వీఆర్వో సస్పెన్షన్‌కు డిమాండ్



ఆందోళన చేస్తున్న బహుజన సేన నాయకులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడుతున్న పోతబోలు వీఆర్వో భరత్‌పై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరత్ వీఆర్వోగా పని చేసిన ప్రతి గ్రామంలో అవినీతికి పాల్పడి కోట్లకు పడగెత్తాడని ఆరోపించారు. వెంటనే ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశాడు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్ మురగయ్య ఫిర్యాదును అందజేశారు. అనంతరం తహసీల్దార్ ధనంజయలుతో ఫోన్లో మాట్లాడుతూ కొత్తపల్లె, కొత్తవారిపల్లె, అంకిశెట్టిపల్లె, పోతబోలు, బసినికొండ గ్రామాల్లో చాలా ఏళ్లు పని చేసిన ఆయన గ్రామ కంఠ భూములు ఇతరులకు కట్టపెట్టి సొమ్ము చేసుకున్నాడని ఆరోపించారు. లంచాలు తీసుకుని 22ఏ భూములను రెగ్యులరైజ్ చేయించాడని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, ఆది, శశికుమార్, హరి, శ్రీనివాసులు, వినయ్, ద్వారక, శివ, జిలానీబాషా, మురళి, రాజేష్, నాగరాజు, దేవేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్ సిబ్బంది ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి


ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్‌లో పని చేస్తున్న మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని, జీవో 36 ప్రకారం రూ. 21 వేలు వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికులను పెంచి పనిభారం తగ్గించాలన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో నలుగురు పారిశుధ్య కార్మికులతో బలవంతంగా పదవీవిరమణ చేయించడమే కాక, వారికి రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మునూజా, కమిషనర్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాయుడు, సాంబశివ నాయక్, రామకృష్ణ, గోపాల్, కృష్ణప్ప, శ్రీనివాసులు, శ్రీరాములు, రమణమ్మ, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా


పీలేరు రూరల్: విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీధర్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఒలంపియాడ్ లెవల్-2 పరీక్షలో మదనపల్లెలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ వన్ అండ్ టూ బ్రాంచ్ విద్యార్థులు విజయఢంకా మోగించారని ఆ పాఠశాల ఆర్ఐ శ్రీధర్ తెలిపారు. ఇందులో జాతీయ స్థాయిలో మొదట 5 ప్రైజ్‌లను, 19మంది విద్యార్థులు సొంతం చేసుకున్నారని తెలిపారు. వారిలో సాహిత్య, స్వాతిగ్నేష్‌కు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ల్యాప్‌ట్యాప్‌లన అందజేశారు. ఆర్ఐ శ్రీధర్, ప్రిన్సిపాల్స్ విజయలక్ష్మి, మహమ్మద్‌రఫీ, డీన్ అనిల్, నూర్, పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : ఒలంపియాడ్‌లో ప్రతిభ కనపర్చిన పీలేరు శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులను కలెక్టర్ చామకూరి శ్రీధర్ అభినందించారు. బుధవారం తనను కలిసిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ సుమన్ గౌడ్, రవికుమార్, డీన్ జానకిరామ్ పాల్గొన్నారు

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలని ఎంఈవో త్యాగరాజు కోరారు. బుధవారం ఉపాధ్యాయులు మండల వ్యాప్తంగా స్పెషల్ అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులపై పిల్లల తల్లితండ్రులకు వివరించారు. తల్లితండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.